సాక్షి
రంగారెడ్డి
శనివారం । 30 । ఆగస్టు । 2025



ఉద్రిక్తతల మధ్య సర్వే
ఆదిబట్ల మున్సి పల్ పరిధిలోని కొంగరక లాన్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో ఉద్రిక్తత నెలకొంది. 8లో▸



అభివృద్ధికి ప్రణాళిక
మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



ప్రభుత్వ పథకాలతో మేలు
ప్రభుత్వ పథకాలతో పేదలకు అన్నివిధాలా మేలు చేకూరుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸

అధ్యక్షా.. సమస్యలివి!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- జిల్లాలో అపరిష్కృతంగా అనేక సమస్యలు
- ఎమ్మెల్యేలు ప్రస్తావించే అవకాశం
- పరిష్కారం కోసం జనం ఎదురుచూపు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు జిల్లాకు చెందిన పలు ప్రధాన సమస్యలను లేవనెత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ అంశం ఎల్బీనగర్ ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించనుండగా.. మూసీ సుందరీకరణ, ఆక్రమణ దారులకు పునరావాసం కల్పన వంటి అంశాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ లేవనెత్తే అవకాశం ఉంది. శేరిలింగంపల్లిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, అభివృద్ధి పథకాలు, రేషన్‌కార్డుల జారీ వంటి అంశాలను ఆ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సభ దృష్టికి తెచ్చే అవకాశం ఉంది. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు ఫార్మాసిటీ రద్దు, జిల్లాలో యూరియా కొరత, రైతుల ఇబ్బందులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై గళమెత్తేందుకు సిద్ధమవుతున్నారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు నిధుల కేటాయింపులో అన్యాయాన్ని ప్రశ్నించనున్నారు.

‘లక్ష్మీదేవిపల్లి’ చర్చకు వచ్చేనా..?
షాద్‌నగర్ నియోజకవర్గంలోని రైతులకు ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. పదేళ్ల క్రితమే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసినప్పటికీ అడుగు ముందుకు పడడం లేదు. నిధుల లేమి ప్రాజెక్టుకు అడ్డంకిగా మారింది. ప్రస్తుత సమావేశాల్లో చర్చకు వస్తుందో లేదో చూడాలి. కొత్తూరు, షాద్‌నగర్, నందిగామ పారిశ్రామికవాడల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోతోంది. తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. కాలుష్య కారక పరిశ్రమలను కట్టడి చేసే అంశం చర్చకు వచ్చే అవకాశం లేకపోలేదు. మారుమూల తండాలు, గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్లు లేకపోవడం, ఉన్నవి ఎక్కడికక్కడ గుంతలు తేలి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగ్ పొందిన పలువురు టీచర్లు తర్వాత దూరభారం పేరుతో డిప్యూటేషన్లపై మరో చోటికి వెళ్లిపోతున్నారు. పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. అక్రమ డిప్యూటేషన్ల అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది.

బీజాపూర్ రోడ్డుకు బీజం పడుతుందా..?
చేవెళ్ల నియోజకవర్గంలోని అప్పా నుంచి మన్నెగూడ జంక్షన్ వరకు విస్తరించిన బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. మూడేళ్ల క్రితం కేంద్రమంత్రి గడ్కరీ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. నియోజకవర్గంలోని మెజార్టీ గ్రామాలు 111 జీఓ పరిధిలో ఉన్నాయి. పలు ఆంక్షలు వి ధించడంతో ఈ సమస్య ఇప్పటికీ అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఆర్టీసీ డిపో కోసం ఏళ్ల క్రితమే స్థలం కేటాయించినా ఇప్పటి వరకు ఏర్పడలేదు. నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు తెచ్చేందుకే పార్టీ మారాల్సి వచ్చిందని ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య పలుమార్లు స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలోని ఆయా సమస్యలపై మాట్లాడతారా అనేది వేచి చూడాల్సిందే.

‘పట్నం’ పాట్లు ప్రస్తావిస్తారా?
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీలు ఇప్పటికీ వెనుకబడే ఉన్నాయి. హెచ్‌ఎండీఏ, ఇతర సంస్థల నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో చిన్నచిన్న పనులకు కూడా ప్రభుత్వంపైనే ఆధారపడాల్సి వస్తోంది. మంచాల మండలం జాపాల-రంగాపూర్ మధ్య 200 ఎకరాల్లో వ్యవసాయ వర్సిటీ ఏర్పాటు అంశం అపరిష్కృతంగా మిగిలిపోయింది. శివన్నగూడెం ప్రాజెక్ట్ ద్వారా సాగునీటి తరలింపు అంశం ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఫార్మాసిటీ రద్దు, భూసేకరణలో చోటు చేసుకున్న అక్రమాలు అసెంబ్లీ వేదికగా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

శ్రీశైలం జాతీయ రహదారిపై చర్చిస్తారా?
కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని ఆమనగల్లు ప్రభుత్వ కాలేజీలకు సొంత భవనాలు లేవు. భవనాల నిర్మాణ అంశం 25 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది. జిల్లాల పునర్విభజనతో వివిధ కార్యాలయాలు ప్రజలకు దూరమయ్యాయి. పాలమూరు-ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు తాగునీరు అందించే ప్రక్రియ అపరిష్కృతంగానే మిగిలిపోయింది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలనే డిమాండ్ ఇప్పటికీ నెరవేరలేదు. ఆయా అంశాలు అసెంబ్లీ వేదికగా చర్చకు వస్తాయో.. లేదో వేచి చూడాల్సిందే.

న్యూస్‌రీల్

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



విద్యార్థుల కరాటే విన్యాసం

షాద్‌నగర్: విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలని పాఠశాలల క్రీడల, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య అన్నారు. నూర్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ బాలికల డిగ్రీ గురుకుల కళాశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కరాటే, కుంగ్‌ఫూ విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే అన్నారు. ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు కూడా నేర్చుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరకత శివ లింగానికి ప్రత్యేక పూజలు



శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయంలోని లింగంపై శుక్రవారం ఉదయం సూర్యకిరణాలు పడ్డాయి. దీంతో స్వామి వారిని దర్శించుకునేందుకు గ్రామంతో పాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగంపై సూర్యకిరణాలు పడడం అరుదని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: జిల్లాలోని 72 పాఠశాలల్లో నాలుగేళ్ల పైబడిన పిల్లల కోసం ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్టు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఈ తరగతులకుగాను విద్యాబోధన చేయడానికి ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు ఇంటర్, ఆయాలు ఏడో తరగతి వరకు చదివి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 6వ తేదీ వరకు జిల్లా విద్యా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగంపై నిఘా పెట్టాలి



అదనపు గదులను ప్రారంభిస్తున్న డీసీపీ

కొత్తూరు: మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై మరింత నిఘా పెట్టాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన సిబ్బంది అదనపు గదులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల ఛేదన, నమోదుతో పాటు పలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తూరు, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామికవాడలు ఉండడంతో కొందరు మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీటిపై ఇప్పటికే ఉక్కుపాదం మోపుతుండగా భవిష్యత్తులో పూర్తిగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల ఛేదనలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన నియామకం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించే నమో మిషన్ వందే గౌమతరం సంస్థ జిల్లాకు సంబంధించి కీలక నియామకాన్ని చేపట్టింది. ఈ సంస్థ ఆధ్యాత్మిక విభాగానికి గుండల్ దత్తు యాదవ్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించింది. సంస్థ విలువలకు అనుగుణంగా ఆధ్యాత్మికత, సేవా దృక్పథం, సామాజిక సంక్షేమంపై గుండల్ దత్తు యాదవ్ అంకితభావం, నిబద్ధతలకు ఈ నియామకం నిదర్శనమని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో డెంగీ కేసులు ప్రబలే ప్రాంతాలను గుర్తించాలని, మలేరియా, చికున్‌గున్యా నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫాగింగ్, రెసిడ్యుల్ స్ప్రే చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించాలని, ఒకవేళ శుభ్రం చేయకుంటే యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని సూచించారు. ఆశా వర్కర్లు ప్రతి రోజు 50 ఇళ్లను సందర్శించి జ్వర సర్వే చేపట్టాలని, యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబర్ వరకు ప్రతి ఇంటిని నాలుగుసార్లు సందర్శించాలన్నారు. మున్సిపాలిటీల్లో స్వచ్ఛ ఆటోలు, గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఆడియో క్లిప్‌ప్లే చేసి వ్యాధుల నివారణ, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే రోజున ఉదయం 10 గంటలకు ఇళ్లను పరిశుభ్రం చేసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చెత్త, నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కూలర్లు, కొబ్బరి చిప్పలు, కుండీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

ఓటరు జాబితా అభ్యంతరాలు సరిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: ఓటరు జాబితా ముసాయిదాపై ఎలాంటి అభ్యంతరాలున్నా స్వీకరించి సరిచేస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జూలై 1న అందుబాటులోకి వచ్చిన నియోజకవర్గాల వారీ ఓటరు జాబితాను అనుసరించి పంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 30 వరకు సరి చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ బూత్‌ల జాబితాలో అభ్యంతరాలున్నా తెలియజేయాలన్నారు. ఈ నెల 30న ఆయా మండలాల్లో ఎంపీడీఓలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశాల్లోనూ అభ్యంతరాలు తెలపొచ్చన్నారు. వాటిని ఈనెల 31న జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. వచ్చే నెల 2న పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీపీఓ సురేష్ మోహన్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్, నాయకులు బోసుపల్లి ప్రతాప్, సామేలు, పర్వతాలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా వెల్లడి

- 7,52,254 మంది ఓటర్లు
- 4,682 పోలింగ్ కేంద్రాలు
- మండలాల వారీగా ఓటర్ల జాబితా
- పోలింగ్ కేంద్రాలు రెడీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల పరిధిలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 7,52,254 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,76,873 మంది పురుషులు, 3,75,353 మంది మహిళలు, మరో 28 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వార్డుల వారీగా మొత్తం 4,682 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసింది. ఇదిలా ఉంటే ఇప్పటికే సిద్ధం చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాను ఆయా పంచాయతీ బోర్డులపై అతికించింది. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వచ్చే అభ్యంతరాలను ఈ నెల 30 వరకు స్వీకరించనున్నారు. 31న పరిష్కారం, సెప్టెంబర్ 2న వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ముందు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకా అనేది ఇంకా తేలాల్సి ఉంది.

మండలాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
అబ్దుల్లాపూర్‌మెట్	17,740	17,841	4	35,585	148
ఆమనగల్లు	7,401	7,311	0	14,712	112
చేవెళ్ల	17,730	17,706	1	35,435	218
ఫరూఖ్‌నగర్	25,396	25,704	4	51,104	410
ఇబ్రహీంపట్నం	15,780	16,053	2	31,835	144
చౌదరిగూడ	13,018	12,844	4	25,866	204
కడ్తాల్	17,489	16,621	2	34,112	210
కందుకూరు	25,865	25,841	0	51,706	312
కేశంపేట	18,316	18,631	0	36,947	260
కొందుర్గు	11,680	11,978	0	23,658	186
కొత్తూరు	8,454	8,358	1	16,813	110
మాడ్గుల	22,780	21,898	0	44,678	302
మహేశ్వరం	22,233	22,351	4	44,588	258
మంచాల	20,477	19,443	0	39,920	216
మొయినాబాద్	15,280	14,969	1	30,250	166
నందిగామ	13,732	13,826	3	27,561	170
షాబాద్	24,208	24,109	1	48,318	352
శంషాబాద్	16,488	16,825	0	33,313	190
శంకర్‌పల్లి	18,709	19,089	0	37,798	210
తలకొండపల్లి	19,124	18,734	0	37,858	272
యాచారం	24,973	25,221	1	50,195	232

వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఈసీ సభ్యురాలిగా శ్రుతి

సాక్షి, సిటీబ్యూరో: భారత వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా కోదాడకు చెందిన వేనేపల్లి శ్రుతి ఎన్నికయ్యారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ వార్షిక సాధారణ సమావేశంలో ఈ మేరకు భారత వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రకటించింది. ప్రస్తుతం ఆమె తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్నారు.

నోటిఫికేషన్‌తో సరి!

- మొండిగౌరెల్లిలో 822 ఎకరాల భూసేకరణ
- మార్చిలో వెలువడిన నోటిఫికేషన్
- పారిశ్రామిక పార్క్ కోసమంటూ అందులో ప్రకటన
- పరిశ్రమలు, పరిహారం విషయంలో స్పష్టత కరువు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



భూసేకరణకు నోటిఫికేషన్ వేసిన సర్వేనంబర్ 19లోని అసైన్డ్ భూమి

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లిలో అసైన్డ్, పట్టా భూముల సేకరణకు నోటిఫికేషన్ వేసి వదిలేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఎటూ తేల్చకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సర్వేనంబర్ 19, 68, 127లోని 821.11 ఎకరాల అసైన్డ్, పట్టా భూమి సేకరణకు బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో (నం.జీ 1-146-2019) బీజం పడింది. కాంగ్రెస్ సర్కార్ మార్చి 10న నోటిఫికేషన్ జారీ చేసి పారిశ్రామిక పార్క్‌ల కోసమని పేర్కొంది. ఆ భూముల్లో ఎలాంటి పారిశ్రామిక పార్క్‌లు కడుతున్నారో.. మరే ఇతర పరిశ్రమలకు ఇస్తున్నారో స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. అసైన్డ్, పట్టా భూములు సేకరించే విషయంలో పరిహారంపై నేటికీ అధికార యంత్రాంగం స్థానిక రైతులతో ఎలాంటి సమావేశం గానీ, చర్చగానీ నిర్వహించలేదు. భూములు ఇచ్చేది లేదని, భూసేకరణ ప్రకటన రద్దు చేసుకోవాలని ఇప్పటికే వారు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డికి విన్నవించారు.

మరెన్ని ఎకరాలు తీసుకుంటారోనని..
19, 68, 127 సర్వేనంబర్ల అసైన్డ్ భూముల పక్కన పలు సర్వేనంబర్లకు చెందిన పట్టా భూములున్నాయి. పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటు చేసి మరిన్ని ఎకరాలు అవసరమైతే చుట్టు పక్కల పట్టా భూములు సైతం తీసుకుంటారేమోనని రైతుల్లో ఆందోళన మొదలైంది. మొండిగౌరెల్లి-యాచారం గ్రామాల మధ్య అనువైన సర్కార్ భూములు ఉండడంతో పరిశ్రమలకు కేటాయిస్తే భూసేకరణ ప్రక్రియ సులువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పక్షం రోజుల క్రితం టీజీఐఐసీ అధికారుల బృందం ఈ రెండు గ్రామాల మధ్యన ఉన్న భూములను రహస్యంగా పరిశీలించినట్లు తెలిసింది. భూసేకరణ నోటిఫికేషన్‌లో కొన్ని పట్టా భూములు, ప్లాట్లు చేసి వెంచర్ కూడా ఉంది.

కొనేవారే రారాయే..
భూసేకరణ నోటిఫికేషన్‌కు (మార్చికి ముందు) ముందు గ్రామంలోని పట్టా భూముల కొనుగోలుకు కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. గడువు ముగిసినా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం కోసం ముందుకు రావడం లేదు.

పట్టా భూమి కొనాలన్నా..



ఎప్పుడు మరెన్ని ఎకరాలకు నోటిఫికేషన్ వేస్తారోననే భయం నెలకొంది. నోటిఫికేషన్‌లో లేని పట్టా భూములు కొనాలన్నా వ్యాపారులు ముందుకు రావడం లేదు.
– మేకల యాదగిరిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

దేనికి ఇస్తారో తెలియదు



నోటిఫికేషన్ వేసిన భూములను ఏ పరిశ్రమకు ఇస్తారో స్పష్టత లేదు. పరిహారం విషయంలోనూ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులకు న్యాయం చేసేలా కృషి చేస్తాం.
– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కనీస వేతనాల సవరణపై 2021లో విడుదల చేసిన జీవోలను యథావిధిగా అమలు చేస్తూ వెంటనే గెజిట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, కవిత, స్వప్న, నర్సిరెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా డిఫెన్స్ భూములపై నివేదిక

అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరిచందన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో గుర్తించిన డిఫెన్స్ భూములకు సంబంధించిన నివేదికలను వారంలోగా అందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మోహినుద్దీన్, మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌లతో కలిసి హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫ్‌నగర్, గోల్కొండ, నాంపల్లి, షేక్‌పేట్‌లో గుర్తించిన డిఫెన్స్ భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఫెన్స్ భూముల్లో నిరుపేదలు నివాసముంటున్నందున ప్రభుత్వం 2022 సంవత్సరంలో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నాలుగు ప్రాంతాల్లోని ఐదు ప్రదేశాలకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత భూములపై డిఫెన్స్ అధికారులతో చర్చించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇప్పటికే అన్ని ప్రదేశాల నుంచి దరఖాస్తులు అందాయని అన్నారు. డిఫెన్స్ భూములపై నివేదిక అనంతరం ల్యాండ్ వాల్యుయేషన్ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, పర్యవేక్షకులు ప్రవీణ్ కుమార్, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

కార్మికుడి బలవన్మరణం


మోహన్ మృతదేహం

పురుగు మందుతాగి.. చికిత్స పొందుతూ మృతి

నందిగామ: పురుగు మందు తాగి ఓ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి ఆర్ఎం స్టీల్ పరిశ్రమలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం జీడీగడ్డ తండా వాసి పాత్లావత్ మోహన్(32) ఏడేళ్లుగా నందిగామ మండలంలోని పరిశ్రమలో క్వాలిటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం యథావిధిగా విధులకు వచ్చిన మోహన్.. 11.30 గంటల సమయంలో పరిశ్రమలోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడున్నాడు. ఇది గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం శంషాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గతంలో జరిగిన ప్రమాదం వలన అయిన గాయాల బాధ భరించలేకే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా.. మోహన్ ఆత్మహత్యకు నిరసనగా తొలుత కుటుంబీకులు పరిశ్రమ ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. కంపెనీలో ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని యాజమాన్యంపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఐ దేవరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

కొత్తూరు: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు దాడి చేసిన సంఘటన శుక్రవారం మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారు వీవీఆర్ వెంచర్లో కొందరు జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆ స్థావరంపై మూకుమ్మడిగా దాడి చేశారు. జూదరులు యెన్నం రఘుమారెడ్డి, నర్సింహ్మ, అంజయ్య, దాస్య, రమేష్, మోహిన్, ఖలీల్‌లను అదుపులోకి తీసుకోగా.. మరో వ్యక్తి అఖిల్ పరారీలో ఉన్నాడు. పేకాటరాయుళ్ల నుంచి రూ.32 వేల 600 నగదు, 5 బైకులు, 5 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

5న మహ్మద్ ప్రవక్త జయంతి

14న మిలాద్ ఊరేగింపు

- సెప్టెంబర్ 6న గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో మారిన తేదీ


సాక్షి, సిటీబ్యూరో: మహ్మద్ ప్రవక్త (మిలాదున్ నబి) జయంతిని ముస్లింలు సెప్టెంబర్ 5న భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఏటా ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గ్రేటర్‌తో పాటు వివిధ జిల్లాలో ఊరేగింపులు నిర్వహిస్తారు. అయితే సెప్టెంబర్ 6న గణేశ్ నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో 4వ తేదీ జరిగే ఊరేగింపును వచ్చే నెల 14కు మార్చినట్లు మీలాదున్ నబి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మౌలాన సయ్యద్ అహ్మద్ ఖాద్రీ షత్తారీ కామీల్‌పాషా తెలిపారు. మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, మీలాద్ కమిటీ సభ్యులతో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మీలాదున్ నబి ఊరేగింపు వచ్చే నెల 14న నిర్వహిస్తున్నట్లు తెలిపామన్నారు. ఊరేగింపు కోసం అన్ని శాఖలు ప్రత్యేకంగా పోలీసు, విద్యుత్తుతో పాటు ఇతర శాఖలు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. దీంతో సీఎం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓన్లీ ఫారిన్ కరెన్సీ!

విదేశీయులనే టార్గెట్ చేసుకుని నగదు చోరీలు

- ఆన్‌లైన్ ద్వారా వారు హాజరయ్యే సదస్సుల గుర్తింపు
- దేశ వ్యాప్తంగా మెట్రో నగరాల్లో నగర వ్యాపారి పంజా
- ఎట్టకేలకు ఇటీవల అరెస్ట్ చేసిన బెంగళూరు పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా జరిగే, విదేశీయులు పాల్గొనే సదస్సులకు వ్యాపారులు ఎందుకు వెళ్తుంటారు..? తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడం, అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసమే అని అందరికీ తెలిసిన విషయమే. అయితే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి మాత్రం చోరీలు చేయడానికి వెళ్లాడు. కొన్నాళ్లుగా వివిధ మెట్రో నగరాల్లో పంజా విసిరిన ఇతగాడు ఎట్టకేలకు ఇటీవల బెంగళూరు పోలీసులకు చిక్కాడు. విచారణ నేపథ్యంలో తాను చేసిన నేరాల చిట్టా బయటపెట్టాడు. నగరానికి చెందిన శ్రీనివాస్ చిన్న స్థాయిలో రాళ్లు, రత్నాల వ్యాపారం చేసేవాడు. తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు కొన్నాళ్లుగా కొత్త పంథా అనుసరిస్తున్నాడు. ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేయడం ద్వారా దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వ్యాపార సదస్సుల వివరాలు తెలుసుకుంటాడు. ప్రధానంగా విదేశీయులు హాజరయ్యే వాటిని ఎంచుకుంటాడు. ఎంట్రీ ఉచితమైనా, భారీ మొత్తం చెల్లించాల్సి ఉన్నా వెనుకాడకుండా రిజిస్టర్ చేసుకుంటాడు. సదస్సు ప్రారంభానికి ముందే ఆ నగరానికి చేరుకుని ఏఏ దేశాల నుంచి డెలిగేట్స్ హాజరవుతున్నారు? ఎప్పుడు వస్తున్నారు? ఎక్కడ బస చేస్తున్నారు? తదితర వివరాలన్నీ నిర్వాహకుల నుంచే తెలుసుకుంటాడు. ఆ అతిథులు బస చేసే హోటళ్లల్లోనే లేదా వాటికి సమీపంలో ఉన్న హోటల్, లాడ్జిలోనే తాను బస ఏర్పాటు చేసుంటాడు. సదస్సు ప్రారంభమైన దగ్గర నుంచీ శ్రీనివాస్ అక్కడికి వచ్చే విదేశీ డెలిగేట్స్ కదలికల్ని గమనిస్తూ ఉంటాడు. వారు తమ బ్యాగ్స్‌ను ఒక్క నిమిషం వదిలినా చాలు... టక్కున అక్కడికి చేరుకుని వాటిలో ఉన్న విదేశీ కరెన్సీని తస్కరిస్తాడు. సాధారణంగా భోజన విరామ సమయంలోనే ఇది సాధ్యమయ్యేది. సదస్సు వేదిక వద్ద తన 'పని' పూర్తికాకపోతే వారు బస చేసిన హోటల్‌కు వెళ్లి తస్కరించేవాడు. ఇతగాడు ఇలా కొన్నాళ్లుగా దేశ వ్యాప్తంగా అనేక మెట్రో నగరాల్లో ఫారినర్స్‌ను టార్గెట్‌గా



చేసుకుని రెచ్చిపోయాడు. ఇటీవల బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని (ఐఐఎస్సీ) జేఎన్ టాటా ఆడిటోరియం, ప్యాలెస్ రోడ్‌లోని ఓ స్టార్ హోటల్స్‌లో తన చేతివాటం ప్రదర్శించాడు. అక్కడ ఐదు రోజుల పాటు జరిగిన సదస్సుకు హాజరైన శ్రీనివాస్ అమెరికా, తైవాన్, ఆస్ట్రేలియా, లావోస్ నుంచి వచ్చిన అతిథుల నుంచి విదేశీ కరెన్సీ తస్కరించాడు. వీటిపై నాలుగు కేసులు నమోదు చేసుకున్న బెంగళూరు పోలీసులు ఘటనా స్థలాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను అధ్యయనం చేశారు. ఫలితంగా శ్రీనివాస్ నిందితుడనితేలడంతోఅతడు బస చేసిన హోటల్ నుంచి అదుపులోకి తీసుకున్నారు. లగేజీని సోదా చేసిన పోలీసులు 300 అమెరికన్, మూడు వేల తైవాన్, 200 ఆస్ట్రేలియా, 7 వేల లావోస్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. తాను ఏ నగరంలో అయితే విదేశీ కరెన్సీని చోరీ చేస్తానో అక్కడే ఉన్న దళారుల ద్వారా ఎక్స్‌ఛేంజ్ చేసుకుంటానని శ్రీనివాస్ వెల్లడించాడు. ఇతడు ఇతర నగరాల్లో చేసిన నేరాలపై బెంగళూరు పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఎమ్మెల్సీ సహకారంతో టాయిలెట్స్ నిర్మాణం

శంకుస్థాపన చేసిన బీఆర్ఎస్ నాయకులు

కేశంపేట: ఇటీవల మండల పర్యటనలో భాగంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మండల పరిధిలోని నిర్దవెల్లి జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన టాయిలెట్స్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు తన సొంత ఖర్చుతో టాయిలెట్స్ నిర్మాణానికి ముందుకు వచ్చారు. శుక్రవారం పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు శంకుస్థాపన కార్యక్రమంను నిర్వహించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, బాలరాజ్‌గౌడ్, యాదయ్య, కృష్ణయ్య, వెంకట్, జగన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహిళ అదృశ్యం

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన గొల్ల నాగప్ప భార్య కవిత(26) కూలీ పనులకు వెళ్లేది. ఎప్పటిలాగే గురువారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం తిరిగి రాకపోవడంతో భర్త నాగప్ప పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శేఖర్(ఫైల్)

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణంలోని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ కూడలి వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపల్లి గ్రామానికి చెందిన దరువుల శేఖర్(20) రాత్రి 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై మంగళపల్లి వెళ్తుండగా.. చౌరస్తా వద్ద ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ ఎగిరి కింద అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన పరమేశ్, ప్రవీణ్ శుక్రవారం ఉదయం బైక్‌పై తక్కళ్లపల్లి గేట్ వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో డీసీఎం ఢీకొట్టింది. ఇరువురికీ తీవ్ర గాయాలు కాగా పోలీసులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పరమేశ్ హైదరాబాద్ సీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

200 మత్తు ట్యాబ్లెట్లు స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితుడు నందే బ్రిడ్జ్

రాజేంద్రనగర్: మత్తు టాబ్లెట్లను విక్రయిస్తున్న ఓ యువకుడిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి 200 ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నందే బ్రిడ్జ్ బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. ఉప్పర్‌పల్లి ప్రాంతంలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి స్నేహితుడు నాగరాజు కర్ణాటకకు వెళ్లి మత్తు ట్యాబ్లెట్లను కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. వాటిని అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పడంతో నందే బ్రిడ్జ్ నాగరాజు వద్ద వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఉదయం ఉప్పర్‌పల్లిలో అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి 200 ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కర్ణాటక నుంచి ట్యాబ్లెట్లను తీసుకొచ్చిన నాగరాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఉద్రిక్తతల మధ్య సర్వే

- కొంగరకలాన్‌లో భూ సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులు
- అడ్డుకున్న ఓ వర్గం రైతులు
- సర్వేకు పట్టుబట్టిన మరో వర్గం
- పోలీసుల సహకారంతో ప్రక్రియ ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో ఉద్రిక్తత నెలకొంది. సర్వే చేయొద్దని ఓ వర్గం రైతులు, చేయాల్సిందేనని మరో వర్గం వారు పట్టుబట్టడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొంగకలాన్‌కు చెందిన రైతు నీళ్ల ప్రభాకర్ ఫిరోజ్‌గూడ సర్వే నంబర్లు 44, 45, 46లో సర్వే కోసం దరఖాస్తు చేశాడు. దీంతో డివిజనల్ సర్వేయర్, మండల సర్వేయర్ పొజిషన్ వద్దకు చేరుకున్నారు. అయితే తమకు నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని నీళ్ల కుటుంబానికి చెందిన పలువురు చుట్టుపక్కల రైతులు అడ్డుకున్నారు. నీళ్ల ప్రభాకర్ పేరున గుంట భూమి కూడా లేదని, పాసుపుస్తకాలు, ధరణిలో అతని పేరు కూడా లేదని మండిపడ్డారు. దీంతో అధికారులు సర్వేకు వెనకడుగు వేశారు. కొద్దిసేపటి తర్వాత సర్వే పూర్తి చేయాలని తమకు ఉన్నతాధికారి నుంచి ఆదేశం ఉందని, సర్వేకు అడ్డు పడొద్దని ఆందోళనకారులకు సూచించారు. దీనికి తోడు ఎట్టి పరిస్థితిలోనూ సర్వే చేయాల్సిందేనని, మిగులు భూమి ఉందనే కారణంతోనే సర్వేను అడ్డుకుంటున్నారని రెండోవర్గం వారు వారించారు. ఈక్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కొంతమంది 100కు డయల్ చేశారు. దీంతో ఆదిబట్ల పోలీసులు అక్కడికి చేరుకుని సర్వేకు సహకరించాలని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. సర్వే చేస్తే మిగులు భూమి వస్తే దానికి సంబంధించిన రికార్డులు ఎలా సృష్టిస్తారని పలువురు రైతులు ప్రశ్నించారు. ఇదే విషయపై గతంలో పరస్పర దాడులు చేసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని, వీరికి పోలీసులు సహకరించారని పలువురు రైతులు ఆరోపించారు. మొత్తానికి అధికారులు సర్వే ప్రక్రియను ప్రారంభించారు.


సర్వేను అడ్డుకుంటున్న రైతులకు సర్ది చెబుతున్న పోలీసులు

ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు

హెచ్‌యం పద్మ నళిని


విజయలక్ష్మీ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని హెచ్‌యం పద్మ నళిని అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న కోట్ల విజయలక్ష్మీ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌యం పద్మ నళిని మాట్లాడుతూ... విద్యాభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులు విద్యార్థులు హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో కాపరులు జాగ్రత్త


జీవాలకు టీకా వేస్తున్న వైద్యాధికారి సుధారెడ్డి

మంచాల: మూగ జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల గొర్ల కాపర్లు జాగ్రతగా ఉండాలని పశు వైద్యాధికారి సుధారెడ్డి చెప్పారు. శుక్రవారం మండల పరిధి నోముల గ్రామంలో జీవాలకు పుర్రు రోగం టీకా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో వచ్చే వాతావరణ మార్పుల వలన జీవాలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ముందు జాగ్రత్తగా వాటికి టీకా వేయించాలని సూచించారు. పశు వైద్య సిబ్బంది శ్రీశైలం పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి ఆదిబట్ల పోలిస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఓటీ సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి సాహెబ్‌గూడలో నర్సింహ వ్యవసాయ క్షేత్రంలో జూదం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పోతురాజు నర్సింహ, దండు లక్ష్మయ్య, బొమ్మరాజు సురేష్, గుండ్ల శ్రీనివాస్, అల్వాల రాంచంద్రారెడ్డి, పాతూరి శర్వందాగౌడ్, నరేందర్, నారని పరమేష్‌గౌడ్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.లక్ష 4వేలు, రెండు సెట్ల కార్డులు, 8 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అమృత్ పథకంలో భాగంగా రూ.76లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు తిరుపతిరెడ్డి, రఘు నాయక్, శ్రీకాంత్ రెడ్డి, శివశంకర్, ప్రవీణ్, ఖదీర్, ముబారక్, అప్పి, జయప్రకాశ్, కరుణాకర్, రవిజేత, దిలీప్, శ్రీధర్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

నందిగామ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం ముఖ ద్వారం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ముఖద్వార నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.15 లక్షల చెక్కు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, చించేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో మేలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండల వాసులకు మంజూరైన 66 సీఎంఆర్ఎఫ్. 11 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, షాబాద్ దర్శన్, మానెయ్య, రాములు, నర్సింలు, మల్లేశ్, సుదర్శన్, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య